


# అన్నీ మంచి శకునములే....

తెల్లవారితే పరీక్షలు.

నలుగురం శ్రీదరోళ్ల మిద్దె మీద చేరి బిక్కుబిక్కుమంటా చదవతా ఉన్నాం తెలుగు పేపరులో రాబోయే పద్యబాగం, గద్యబాగం కొసెన్లని.

పద్యబాగంలో బలిచక్రవర్తి పాటం ఉంది. అందులో 'వారేరీ... సిరి మూట గట్టుకొని పోవం జాలరే'... అనేది ఇంపార్టెంటు పద్యం. దాన్ని బట్టీగొట్టి అర్దం, తాత్పర్యం, ప్రతిప దార్దం... అన్నీ రాస్తే ఎనిమిది మార్కులు గ్యారంటీ.

అందుకని కందుల మాలకొండరావుగాడు తడవకోసారి 'వారేరీ.. సిరి మూటగట్టు కొని పోవం జాలరే'... అని దబాయిస్తా ఉన్నాడు శుక్రాచార్యుడి కాడ బలిచక్రవర్తి మాడ ల్లో.

నేను గద్యబాగంలోని 'నిగమశర్మ అక్క' పాటం మీద కాన్సన్‌ట్రేషను పెట్టి ఉన్నాను. 'నిగమశర్మ అక్క నామౌచిత్యము తెలుపుము' అనేది చాలా ఇంపార్టెంటు కొసెను.

ఆ పాటంలో నిగమశర్మ అనే ఎదవకి ఒక అక్క ఉంటుంది. ఆ అక్క సాధ్వీమణి. ఎదవగా మారిన తమ్ముడిని సాకి, సంతరించి, ఫైనం చేయడంలో ఆమె పేరే 'నిగమశర్మ అక్క' అయిపోతుంది. ప్రతి సంవచ్చరం ఈ కొసెను అడగతా ఉన్నారని చెప్పి నేను దానిని బట్టీ కొడతా ఉన్నాను. శ్రీదరుగాడు, మురళీగాడు కూడా పద్యబాగమైతే పద్యబాగం, గద్యబాగం అయితే గద్యబాగం చదవతా ఉన్నారు.

అప్పటికే మాకు హాల్‌టికెట్లు వచ్చేసున్నాయి. ఎగ్జామినేషను సెంటరుగా ఏబిఎం ఇస్కూలిని అలాట్ చేసున్నారు మాకు. ఆ హాల్ టికెట్లు చూసుకొని, మా నెంబర్లు నోట్ చేసుకొని, రేపు పరీక్షలప్పుడు ఆ నెంబర్లని తప్పులు రాయకుండా ఉండేదానికి ఒకటికి పదిసార్లు బట్టీ గొట్టి, జీవితాన తొలిసారిగా దిగిన బ్లాక్ అండ్ వైటు పాస్ట్‌పోర్ట్ సైజు ఫోటోలని ఆ హాల్‌టికెట్ల మీద చూసి మురుసుకొని పాటాలు చదవడంలో ఇంకా స్పీడు పెంచినాం.

ఆ ముందరి రోజే తెలుగు సిలబసు అంతా అయిపోయింది. రేప్పొద్దున పరీక్ష గాబట్టి ఇవాళ ఇంపార్టెంటు కొస్చెన్ల వరకు రివిజను పెట్టుకున్నాం.

చదవతా ఉన్నామన్న మాటేగానీ మా మనసులు యాడాడ్నో ఉన్నాయి. లోపల్లోపల దడదడగా గుడగుడగా ఉంది. అప్పటికే మురళీగాడు 'ఇప్పుడే వస్తాను మావా' అని తేపకొకసారి ఒంటేలుకి పోయొస్తా ఉన్నాడు బయంతో.

అసలికే గాలి బాగలా. మబ్బు కూడా బాగలా. పైన చందమామ మూసుకొని పోయి చీకటి చీకటిగా ఉంది అంతా.

'మావా. ఏందిరా ఇది. పరీక్షలు మొదలవతా ఉంటే శకునం ఏందిరా ఇట్టా ఉంది' అన్నాడు మురళీగాడు పైకీ కిందకీ చూస్తా.

'ఒరే.. ఆపండిరా కాసేపు పాటాలు' అన్నాడు మళ్లీ.

యాక్చువల్‌గా కంబైన్డ్ స్టడీలో మేము కబుర్లు చెప్పుకోవాల్సిన 'బ్రేక్ టైము' టెన్ టు టెన్ తర్టీ. ఇప్పుడు టెన్ అవతా ఉంది. అయినాగానీ అందరికీ రకరకాల బయాలు ఉన్నాయి కాబట్టి 'బ్రేక్ టైమ్' తీసుకొని పుస్తకాలు మూసేసి ఒకచోట చేరినాం.

'మావా.. మా తాతయ్య చెప్తా ఉంటాడు. ఏ పనికైనా శకునం చూసుకోవాలని చెప్పి. అసలికే పరీక్షలు మొదలవతా ఉన్నాయి. ఇన్నాళ్లు తెల్లంగా శుద్ధంగా ఉండే ఆకాశం యియ్యాల ఏందిరా మబ్బు మబ్బుగా ఉంది... గాలి కూడా ఎర్రగా ఉందిరా. చూడబోతే మనకి టైము బాగున్నట్టు లేదు మావా' అన్నాడు మురళీగాడు.

మాకు కొంచెం కొంచెంగా బయం పుట్టింది.

'పరీక్ష రేపు కదరా. శకునం గికునం రేపు చూసుకుంటే బెటరురా' అన్నాను నేను.

మాలకొండరావుగాడు కూడా ఊరుకోకుండా 'అయినా బయం ఎందుకురా. హాల్‌టికెట్టు తీసుకోంగానే నేను మా యింటికి ఎళ్లి, మా ఇలవేల్పు మాలకొండ లక్ష్మినరసింహ స్వామి పటం ముందర దానిని పెట్టి, టెంకాయ కొట్టి, బోనసుగా పరీక్షలు అయినాక కూడా ఒక టెంకాయ కొడతానని మొక్కుకున్నానురా. మీరు నమ్మతారో నమ్మరో నేను కొట్టిన టెంకాయ సరిగ్గా సగానికి బలే పగిలింది మావా. నా శకునం చాలా బాగుంది. నాకే బయం లేదురా' అన్నాడు మాతో.

'నేను కూడా హాల్‌టికెటు తెచ్చుకోంగానే ఎంకటేశ్వర స్వామి పటం కాడ పెట్టి దండం పెట్టుకున్నాను మావా. ఎంకటేశ్వర స్వామి అంటే ఎవరు? ఆపద మొక్కులవాడు. నాకు ఏ ఆపదా రానియ్యడని నామటుకు నాకు నమ్మకం ఉందిరా' అన్నాడు కేతిరెడ్డి శ్రీదరుగాడు.

'ఒరే ఆ మాటకొస్తే మా తాత కూడా నా హాల్‌టికెట్టు రాంగానే దానికి నాలుగు మూలలా నాలుగు కొసల్లో పసుపు రాసి, గీతామందిరానికి తీసకెళ్లి పూజ చేసి, మళ్లా తీస కొచ్చి బద్రంగా దేవుడి గదిలో పెట్టినాడురా. అంత మాత్రం చేత శకునాలని కొట్టి పారేసే దానికి లేదురా' అన్నాడు కాండూరి మురళీగాడు.

'మావా. నువ్వు చెప్తా ఉంటే నాకు లేనిపోని డౌట్లు వస్తా ఉన్నాయి. నేను హాల్‌టికెటు తీసుకొని ఇంటికి రాంగానే గోడ మీదుండే మక్కా మదీనా ఫోటోలకి దానిని టచ్ చేయించి, ఖురాను ఉండే ట్రంకు పెట్టె కాడికి తీసుకెళ్లి దానికింద జాగ్రత్తగా పెట్టి ఇంకేం బయం లేదు అని అనుకుంటా ఉన్నాను గదరా' అన్నాను నేను.

నలుగురికి కాసేపు ఏం మాట్లాడాలో తెలియలేదు. ఉత్తపుణ్యానికి ఈ శకునాల మాట ఎత్తి లేనిపోని టెన్షను తెచ్చిపెట్టిన మురళీగాడి మీద నాకు కోపం వచ్చింది.

'బలే పెట్టినావురా పితలాటకం అనవసరంగా నాయాల' అన్నాను వాణ్ణి తిడతా.

'ఒరే... నువ్వు ఎన్నయినా తిట్టు. నేను మీ మేలు కోరేవాణ్ణి కాబట్టి మీకు నాలుగు మాటలు చెప్పక తప్పదురా' అన్నాడు వాడు.

'ఏందిరా అవి' అన్నాము మేము.

'మట్టికుండ, నల్లపిల్లి, ఒక్కతుమ్ము, ఒంటి బేపడు' అన్నాడు వాడు.

'ఏందిరా ఇవీ'... అన్నాము మేము.

'చెడు శకునాలురా'

'రేపు మనం పరీక్షలకి బయలుదేరే ముందర యీ శకునాలు గనక ఎదురైతే మళ్లా యిళ్లలోకి పోయి కాసేపు కూచుని మంచినీళ్లు తాగి తిరిగి బయలుదేరాలి మావా' అన్నాడు మళ్లీ.

'ఓహో' అనుకున్నాం మేము.

'మురళీగా. నువ్వు కూడా ఒంటి బేపనోడివే గదరా. నువ్వు ఎదురొస్తే మేమంతా ఇళ్ళల్లోకి పోవాల్సిందేనంటరా?' అన్నాను నేను.

'ఛ..ఛ నేను కాదురా. తెల్లదోవతీలు కట్టుకొని, నామాలు పెట్టుకొని, బుజాలకి సంచులు తగిలించుకొని పనుల మీద పోతా ఉంటారు చూడూ... వాళ్లు ఎదురొస్తే'.. అన్నాడు వాడు.

'ఓహో' అనుకున్నాం మళ్లా.

'మరి మంచి శకునాలు ఏవిరా' అన్నాడు శ్రీదరుగాడు.

'కుడితి కుండ, సూడిగేదె, పేడతట్ట, ముత్తయిదు ఆడమనిషి... ఈళ్లు గనుక ఎదురైతే మనకు తిరుగేలేదురా' అన్నాడు.

శకునాల మీద వాడంత కమాండింగుగా మాట్లాడటం చూసి మా అందరికీ ముచ్చటేసింది. ఆ రాత్రి మేము చదువుకొని చదువుకొని పడుకోబోయే ముందర శకునాలన్నీ ఒక

సారి మళ్లా తలుచుకొని నిద్రపోయినాం.

తెల్లారింది. మా లైఫులో చాలా ఇంపార్టెంటు రోజు వచ్చేసింది. అందరం గబగబా ఇళ్లకి పొయ్యి, తలస్నానాలు చేసి, మంచి గుడ్డలు కట్టుకొని, జేబుల్లో హాల్‌టికెట్లు, పెన్లు పెట్టుకొని, పాలు తాగి ఇళ్లల్లో నుంచి బయటపడడానికి రెడీ అయిపోయినాం.

మంచి శకునం చూసి బయలుదేరదామని నేను అనుకుంటా ఉంటే మా అమ్మ గబ గబా వచ్చి మా పెరట్లో ఉన్న దాసాని (మందారం) చెట్టు కొమ్మ వంచి రెండు పూలు కోసి గడప మీద పడేసింది.

'ఒరే.. పోయేటప్పుడు యీటిని తొక్కి పోరా' అంది.

'ఏందిమా ఇదా?' అన్నాను నేను అర్థంగాక.

'నీకు తెలియదులేరా. యివి ఎర్రపూలు గదా. ఎరుపు డేంజరుకి గుర్తు గాబట్టి యీటిని తొక్కిపోతే పరీక్షల్లో నీకు రాబోయే డేంజరులన్నింటినీ బయం లేకుండా తొక్కిపారేస్తావ న్నమాట. మనకేం తెలుసు. పెద్దలు చెప్పింది. చేస్తే పోదా' అంది.

ఇదేదో బాగానే ఉందే అనుకొని వాటిని తొక్కి ముత్తయిదు శకునం కోసం ఎదురు చూస్తా ఉంటే మా అమ్మ మళ్లా కల్పించుకుంది.

'ముత్తయిదు శకునం ఎందుకురా. మన చిన్నోడు పుట్టినాకే మనకు కలిసి వచ్చింది. నల్లంగా ఉన్నా వాడిది కళ మొకం. వాడు ఎదురొస్తే అంతా మంచిదే పో' అని వాణ్ణి ఎదురు పంపించింది.

అట్టా మురళీగాడు చెప్పిన నాలుగు మంచి శకునాలు గాకుండా మా తమ్ముడి శకు నంతో నేను పరీక్షలకి బయలుదేరినాను. శ్రీదరుగాడికి వాళ్ల అమ్మ ఎదురొచ్చింది. మాల కొండరావుగాడికి వాళ్ల జయక్క. మురళీగాడికి మాత్రం పెరట్లో ఉండాల్సిన కుడితి కుండను గడపకాడికి తెచ్చి దానిని శకునంగా చూపించి పంపించినారు.

ఆ రోజు అందరం అడిషనల్ షీట్ల మీద అడిషనల్ షీట్లు తీసుకొని పరీక్షలు బాగా రాసినాం. ఇళ్లకొచ్చినాక ఎవరి ఆన్సర్లకి ఎన్ని మార్కులు వస్తాయో లెక్కలేసుకొని అమ్మయ్య అనుకున్నాం.

పరీక్షలు స్పీడుగా జరగతా ఉన్నాయి. శకునాలు మాత్రం తొలిరోజువే కంటిన్యూ చేస్తా అందరం టకటకా రాస్తా ఉన్నాము. అయితే రాసేకొద్దీ మాకు కొత్త కొత్త సెంటి మెంట్లు కూడా మనసుల్లో పడటం మొదలైనాయి.

–నాకొక ఎర్రరంగు గళ్ల చొక్కా ఉంది. అది ఏసుకెళితే పరీక్ష డమాల్. బ్లూ కలర్ షర్టు ఏసుకెళితే పరీక్ష బాగరాస్తా. ఇది నా సెంటిమెంటు.

–పొద్దున పరీక్షకి పోయేటప్పుడు హాల్‌టికెట్టుగానీ, పెన్నుగానీ పొరపాటున చేతిలో నుంచి జారి కింద పడిందో ఇంక మురళీగాడి మొకంలో నీళ్లు దిగిపోతాయి. అట్టా జరిగితే పరీక్ష బాగ రాయనని వాడి సెంటిమెంటు.

–పరీక్షకి బయలుదేరినాక ఏదైనా మర్చిపోయి మళ్లా యింట్లోకి పోతే ఆ పరీక్ష బాగా రాస్తానని శ్రీదరుగాడి నమ్మకం. అందుకని వాడు కావాలని చెప్పి పరీక్షకు బయలుదేరి నాక మళ్లా ఎనక్కి ఇంట్లోకి పాయొచ్చేవాడు సెంటిమెంటుగా.

–మాలకొండరావుగాడు హీరో పెన్నుతో పరీక్ష రాస్తాడు. బయలుదేరే ముందర దాని డొప్పా తెరిచి ఇంకు చెక్ చేసుకోవడం వాడి సెంటిమెంటు. అట్టా చెక్ చేయడం మర్చిపోతే పరీక్షల్లో వాడు ఆన్సర్లు మర్చిపోతాడంట.

ఇట్టా సెంటిమెంట్ల మీద సెంటిమెంట్లు, శకునాల మీద శకునాలు పెట్టుకొని అందరం పరీక్షలు కంప్లీటు చేసినాం.

లాస్ట్‌రోజు మా కుమారస్వామి ఐవోరుని ఇంటికెళ్లి కలిస్తే అందరినీ పేరు పేరునా పలకరించి 'ఎట్టా రాశారురా' అని అడిగినాడు.

'బాగా రాసినాము సార్. ఇస్కూలికి సెంట్ పర్సెంటు రిజల్టు గ్యారంటీ సార్' అన్నాము మేము.

ఆయన మొకాన నవ్వొచ్చేసింది.

'అమ్మయ్య. బతికించినారు. ఎట్ట రాస్తారో ఏందో అని గుబాగుబా అనుకుంటా ఉన్నాను లోపల. ఇంక మీరు పొండి. నేను అర్జెంటుగా ఈ గెడ్డం గీసుకోవాల' అని మా పరీక్షలయ్యేదాకా సెంటిమెంటుగా పెంచిన నల్లటి గెడ్డాన్ని సవరించుకుంటా హుషారుగా యిజిలేసుకుంటా  లోపలికెళ్లిపోయినాడాయన.

ఆయన పోతా ఉంటే ఆ యిజిలు పాట మా చెవుల్లో పడింది.

'అన్ని మంచిశకునములే కన్యాలాబ సూచనలే'...

కన్యాలాబం ఏమోగానీ ఆ సాయంత్రం మేమందరం ఫస్ట్‌షో సినిమాకి ఎళ్లడానికి మాత్రం మా ఇళ్లల్లో ఒక్కొక్కరికి ఇరవై రూపాయలు గిట్టుబాటు అయినాయబ్బా. ■